

టమాట కిలో రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



తమ్ముళ్ల మట్టి దందా

చిలమత్తూరు తెలుగుతమ్ముళ్ల కన్ను ప్రకృతి సంపదపై పడింది. ఐటీడీపీ సభ్యుడైన నేత అండతో అతని సోదరుడు మట్టిదందా యథేచ్ఛగా సాగిస్తున్నాడు

8లో

గరిష్ఠం/కనిష్ఠం

30.4°/ 13.8°

జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నృసింహాలయ క్యాలెండర్ ఆవిష్కరణ



శ్రీవారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం రూపొందించిన నూతన సంవత్సర (2024) క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పాలక మండలి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, నృసింహుని ఆలయ క్యాలెండర్‌కు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రంలో కూడా చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. ఆలయానికి సంబంధించిన వివిధ పూజలతో పాటు అన్ని రకాల సేవలు ఇందులో పొందు పరిచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ శ్రీనివాసరెడ్డి, పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

వీరభద్రుని సేవలో ఎన్‌ఆర్‌ఎస్‌ఏ బృందం



ఎన్‌ఆర్‌ఎస్‌ఏ బృందాన్ని సన్మానిస్తున్న సిబ్బంది

లేపాక్షి: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయాన్ని శుక్రవారం ఉదయం నేషనల్ రిమోట్ సెన్సార్ ఏజెన్సీ (ఎన్‌ఆర్‌ఎస్‌ఏ) బృందం సభ్యులు అనీల్, గోవిందరాజులు సందర్శించారు. దుర్గాదేవి, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వారికి స్వాగతం పలికిన ఆలయ అర్చకులు, ఆలయ విశిష్టతను వివరించారు. స్వామివారి ప్రసాదం అందజేసి సన్మానించారు.

రేపు సచివాలయాల వద్ద రేషన్ పంపిణీ



పుట్టపర్తి అర్బన్: కార్డుదారులందరికీ రేషన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే ప్రతి నెలా 15వ తేదీ వరకూ ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే వచ్చి రేషన్ పంపిణీ చేయిస్తోంది. అయితే అనివార్య కారణాలతో రేషన్ పొందలేని వారికి 17వ తేదీన ఆయా గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ అందించేలా చర్యలు తీసుకుంది. జిల్లాలోని కార్డుదారులందరికీ డిసెంబర్ 15వ తేదీలోపు రేషన్ అందించేందుకు చర్యలు తీసుకున్నామని, అయితే మిగిలినపోయిన వారు ఎవరైనా ఉంటే 17వ తేదీ సచివాలయాల వద్దకు వెళ్లి రేషన్ తీసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ చేతన్ వెల్లడించారు. సరుకుల పంపిణీలో అక్రమాలు, సమస్యలు ఉన్నట్లయితే 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ప్రభుత్వానికి తెలియజేయాలని జేసీ సూచించారు.

రేపు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు జెడ్పీ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. స్థాయీ సంఘం-1, 2, 4, 7 (ఆర్థిక, ప్రణాళిక/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు ప్రధాన సమావేశ భవన్‌లో ఉదయం 10 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ప్రారంభం కానున్నాయి. స్థాయీ సంఘం-3, 5, 6 (వ్యవసాయం/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు అదనపు సమావేశ భవన్‌లో ఆయా స్థాయీసంఘాల చైర్మన్ల అధ్యక్షతన నిర్వహించనున్నారు. గత సమావేశాల్లో సభ్యులు చర్చించిన అంశాలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల గురించి సమగ్ర వివరాలతో అధికారులు సమావేశాలకు హాజరు కావాలని సూచించారు.

బాల్యానికి టీకా రక్ష



- చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వ్యాక్సినేషన్
- మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా చిన్నారులకు టీకాలు



మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రశాంతి నిలయం: చిన్నారుల ఆరోగ్యంపై జగన్ సర్కార్ ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పుట్టిన రోజు నుంచే టీకాలు వేస్తూ వ్యాధుల బారి నుంచి రక్షిస్తోంది. వ్యాధి నిరోధక శక్తి పెంచి హెపటైటిస్-బీ, కోరింత దగ్గు, ధనుర్వాతం, క్షయ, పోలియో, గవదబిళ్లలు వంటి వ్యాధుల బారిన పడకుండా ఎప్పటికప్పుడు ఆస్పత్రుల్లో ఉచితంగా టీకాలు వేస్తోంది. అయితే స్థానికంగా అందుబాటులో లేకపోవడం, జ్వరం రావడం తదితర కారణాలతో టీకాలు వేయించుకోని వారి కోసం ప్రత్యేకంగా 'మిషన్ ఇంద్ర ధనస్సు' కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమం కింద వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఇంకా టీకాలు వేయించుకోని చిన్నారులను గుర్తించి అక్కడే వ్యాక్సిన్ వేయిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈనెల 11న ప్రారంభమైన ఈ కార్యక్రమం 16వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొనసాగనుంది.

పెరిగిన అవగాహన..

గతంలో సిబ్బంది కొరత ప్రజల్లో అవగాహన లోపంతో పిల్లలకు వ్యాక్సినేషన్ వేయించేందుకు తల్లిదండ్రులు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. పిల్లలు సైతం వ్యాక్సిన్‌లు వేసుకోవడానికి భయపడేవారు. అయితే ఇటీవల కాలంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ టీకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడంతో పాటు చిన్నారులకు ఏ సమయంలో ఏ టీకా వేయించాలన్న దానిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దీంతో అందరూ తమ చిన్నారులకు టీకాలు వేయించేందుకు ముందుకు వస్తున్నారు.

క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్..

పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులతో పాటు జిల్లా ఆస్పత్రిలోనూ క్రమం తప్పకుండా టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి నెలలో మొదటి బుధ, శనివారాల్లో పిల్లలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇటీవల వ్యాక్సినేషన్ డేలో భాగంగా రెండో బుధ, శనివారాల్లోనూ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

కొరత లేకుండా సరఫరా...

చిన్నారులందరికీ వ్యాక్సినేషన్ పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం... ప్రతి ఆరోగ్య కేంద్రానికి అవసరమైన టీకాలను జిల్లా ఇమ్యూనైజేషన్ కేంద్రాల నుంచి సరఫరా చేస్తోంది. జిల్లాలోని 49 పీహెచ్‌సీలు, 18 అర్బన్ హెల్త్ సెంటర్లలో క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మిషన్ ఇంద్ర ధనస్సులో భాగంగా ఈనెల 11 నుంచి 1,829 వ్యాక్సినేషన్ శిబిరాలు నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటికే 1,720 శిబిరాలు నిర్వహించారు. గతంలో టీకాలు వేసుకోని 126 మంది గర్భవతులకు, 496 మంది ఏడాదిలోపు వయస్సు ఉన్న పిల్లలకు అవసరమైన టీకాలు వేశారు.

చిన్నారులకు టీకాలు ఇలా..

- అప్పుడే పుట్టిన శిశువుకు బీసీజీ, ఓపీవీ సున్నా మోతాదు, హెపటైటీస్-బి వ్యాక్సిన్ ఇస్తారు.
- 6 వారాలకు ఓపీవీ-1, పెంటావాలెంట్-1, రోటా-1, ఎఫ్ఎల్‌పీవీ-1, పీసీవీ-1 వాక్సిన్ వేస్తారు.
- 14 వారాల వయసున్న చిన్నారులకు ఓపీవీ-3, పెంటా వాలెంట్-3, రోటా వైరస్-3, ఎఫ్ఎల్‌పీవీ-2, పీసీవీ-2 వ్యాక్సిన్ ఇస్తారు.
- 9 నెలలకు మీజీల్స్-1, ఎంఆర్-1, విటమిన్-ఎ, జేఈ-1, పీసీవీ-బీ వ్యాక్సిన్ ఇస్తున్నారు.
- 16 నుంచి 24 నెలల వయస్సున్న చిన్నారులకు డీపీటీ మొదటి బూస్టర్ డోస్, ఓపీవీ బూస్టర్ డోస్, మీజీల్స్ రుబెల్లా-2, ఎంఆర్-2, జేఈ-2 వ్యాక్సిన్లు వేస్తున్నారు.
- ఐదు నుంచి ఆరేళ్ల మధ్య వయసున్న వారికి డీపీటీ రెండో బూస్టర్, 10 నుంచి 16 ఏళ్లలోపు వారికి టీటీ వ్యాక్సిన్ అందిస్తున్నారు.

వంద శాతం వ్యాక్సినేషనే లక్ష్యం



చిన్నారులందరికీ టీకాలు వేయించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 'మిషన్ ఇంద్ర ధనస్సు' కార్యక్రమాన్ని చేపట్టింది. ఈనెల 11 నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో వ్యాక్సినేషన్ కొనసాగుతుంది. వందశాతం వ్యాక్సినేషనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. తల్లిదండ్రులు కూడా టీకాల ప్రాముఖ్యతను గుర్తించి చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి.

– కిష్టయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

పాఠశాలల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం

కదిరి: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జనవరి 25న ప్రతి పాఠశాలలో ఘనంగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పయ్యావుల పార్వతి ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవరి 23న జిల్లాలోని అన్ని కళాశాలలు, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జనవరి 25న బహుమతులు ప్రదానం చేయాలని సూచించారు. అలాగే ఓటర్ల దినోత్సవంపై ప్రజలకు సైతం అవగాహన కల్పించేందుకు రంగోళి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షాలు



బుక్కరాయసముద్రం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కదిరి, హిందూపురం, పెనుకొండ, మడకశిర, ధర్మవరం, తాడిపత్రి డివిజన్లలో రానున్న 18, 19, 20 తేదీల్లో చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుల చేశారు.

ఎన్నికల ఏర్పాట్లు ప్రారంభం

- స్ట్రాంగ్ రూమ్‌ల కోసం పాఠశాల గదుల పరిశీలన
- ఎస్పీతో కలిసి లేపాక్షి, గోరంట్ల మండలాల్లో పర్యటించిన కలెక్టర్



అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

గోరంట్ల/లేపాక్షి: సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు ప్రారంభించింది. ఇప్పటికే ఓటరు జాబితా సవరణకు తగు చర్యలు చేపట్టారు. తాజాగా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి శుక్రవారం గోరంట్ల, లేపాక్షి మండలాల్లో పర్యటించారు. ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు కోసం వివిధ పాఠశాలలను సందర్శించి గదులను పరిశీలించారు. తొలుత ఎస్పీతో కలిసి గోరంట్లలో పర్యటించిన కలెక్టర్ గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలతో పాటు మందలపల్లి సమీపంలోని కేజీబీవీని పరిశీలించారు. కేజీబీవీలో నూతనంగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో సౌకర్యాలు ఆరా తీశారు. అక్కడి నుండి నేరుగా గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకొని ఆడిటోరియంతో పాటు అన్ని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. గోరంట్లలో రెండు నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అధికారులు పాఠశాలలను సందర్శించి సౌకర్యాలు ఆరా తీసినట్లు సమాచారం. అనంతరం లేపాక్షికి వెళ్లిన కలెక్టర్, ఎస్పీ చోళసముద్రం పరిధిలోని నాయనిపల్లి క్రాస్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలను సందర్శించి మౌలిక వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో జేసీ టీఎస్ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ రంగనాయకులు ఉన్నారు.

'జగనన్న సివిల్ సర్వీసెస్'కు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్: 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక' పథకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శివరంగప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఈ పథకం ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల్లోని అభ్యర్థులకు ఆర్థికంగా అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం 'జగనన్న సివిల్ సర్వీసెస్' ప్రోత్సాహ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. అర్హులు ఈ నెల 19వ తేదీలోపు www.jnanabhumi. ap. gov. in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2023 సంవత్సరంలో మెయిన్స్‌కు అర్హత సాధించిన వారికి రూ. 50 వేల నగదు అందుతుందని వెల్లడించారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

- వర్ధంతి సభలో డీఆర్‌ఓ కొండయ్య



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని డీఆర్‌ఓ కొండయ్య అన్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పలువురు అధికారులు ఆ మహనీయుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ, మహనీయుల జీవిత గాథలను స్మరించుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ద్వారానే న్యాయం జరుగుతుందని భావించిన పొట్టి శ్రీరాములు 1952 అక్టోబరు 19న నిరాహార దీక్ష చేపట్టి డిసెంబరు 15న ప్రాణాలు అర్పించి అమరజీవి అయ్యారన్నారు. ఆ త్యాగఫలం కారణంగానే ఆంధ్రరాష్ట్రం ఏర్పాటయ్యిందన్నారు. అమరజీవి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన చూపిన బాటలో అందరూ నడవాలన్నారు. ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన ఆయన అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు శివరంగప్రసాద్, మోహన్‌రాం, నిర్మలాజ్యోతి, పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, డ్వామా ఏపీడీ శివశంకర్, భూగర్భ జల శాఖ అధికారి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు ఫుల్!

- లక్ష్యంవైపు దూసుకెళ్తున్న రిజిస్ట్రేషన్ శాఖ
- టార్గెట్‌లో ఇప్పటికే 77.20 శాతం మేర వసూలు
- తనకల్లు, మడకశిరలో లక్ష్యానికి మించిన వైనం
- చిలమత్తూరు, సీకే పల్లి, పెనుకొండలో ఆశాజనకం
- హిందూపురం, ధర్మవరం కార్యాలయాల నుంచి అధిక రాబడి



హిందూపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట కొనుగోలు, అమ్మకందారుల సందడి

సాక్షి, పుట్టపర్తి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వసతులు పెరిగి శివారు ప్రాంతాలూ అభివృద్ధి చెందాయి. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోగా స్థిరాస్తి అమ్మకాలు, కొనుగోళ్లు జోరుగా సాగాయి. ఫలితంగా జిల్లాలో రిజిస్ట్రేషన్ల సంఖ్యతో పాటు ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతోంది. ఇటీవలే ప్రభుత్వం కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (కార్డ్) సాఫ్ట్‌వేర్‌ను మరింత ఆధునీకరించి కార్డ్ ప్రైమ్ 2.0కు రూపకల్పన చేసింది. దీంతో ఆస్తుల రిజిస్ట్రేషన్లు చక చకా జరిగిపోతున్నాయి. తద్వారా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సులువుగా లక్ష్యాన్ని చేరుకుంటోంది.

ప్రభుత్వానికి రూ.116.68 కోట్లు..

జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి నవంబరు 30వ తేదీ నాటికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖకు నిర్దేశించిన లక్ష్యంలో సగటున 77.20 శాతం మేర వసూలు అయింది. తనకల్లు, మడకశిర, చిలమత్తూరు, చెన్నేకొత్తపల్లి, పెనుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నుంచి లక్ష్యానికి మించి ప్రభుత్వానికి ఆదాయం చేకూరింది. హిందూపురం, కదిరి, ధర్మవరం, బుక్కపట్నం కార్యాలయాలు లక్ష్యానికి చేరువలో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లాలోని 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు (బుక్కపట్నం, చిలమత్తూరు, సీకే పల్లి, ధర్మవరం, హిందూపురం, కదిరి, మడకశిర, పెనుకొండ, తనకల్లు) ఉన్నాయి. 2023 ఏప్రిల్ నుంచి 2023 నవంబరు 30 నాటికి మొత్తం రూ.151.15 కోట్ల లక్ష్యానికి గానూ రూ.116.68 కోట్లు (77.20 శాతం) వసూలైంది.

హిందూపురంలోనే ఎక్కువ..

జిల్లాలోని 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల లక్ష్యం రూ.151.15 కోట్లు ఉండగా.. నవంబరు 30 నాటికి రూ.116.68 కోట్లు రాబడి వచ్చింది. అందులో హిందూపురంలో రూ.32.77 కోట్లు, ధర్మవరంలో రూ.20.75, కదిరిలో రూ.16.58 కోట్లు, పెనుకొండలో రూ. 15.78 కోట్లు, చిలమత్తూరులో రూ.15.42 కోట్లు, మడకశిరలో రూ.6.75 కోట్లు, సీకే పల్లిలో రూ.5.22 కోట్లు, తనకల్లులో రూ.3.21 కోట్లు మేర వసూలైంది.

టాప్‌లేపిన తనకల్లు..

తనకల్లు, మడకశిర, చిలమత్తూరు, సీకే పల్లి, పెనుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో లక్ష్యానికి మించి రాబడి వచ్చింది. తనకల్లులో 154.26 శాతం, మడకశిరలో 131.66, సీకే పల్లిలో 113.71, చిలమత్తూరులో 113.67, పెనుకొండలో 103.33, హిందూపురంలో 97.75, కదిరిలో 68.66, ధర్మవరంలో 59.17 మేర లక్ష్యం పూర్తయింది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా రాబడి (2023 ఏప్రిల్ 1 నుంచి నవంబరు 30 వరకు)

కార్యాలయం	లక్ష్యం (రూ.కోట్లలో)	వసూలు (రూ.కోట్లలో)	శాతం
బుక్కపట్నం	17.78	0.21	1.15
చిలమత్తూరు	13.56	15.42	113.71
చెన్నేకొత్తపల్లి	04.59	05.22	113.67
ధర్మవరం	35.06	20.75	59.17
హిందూపురం	33.52	32.77	97.75
కదిరి	24.15	16.58	68.66
మడకశిర	05.13	06.75	131.66
పెనుకొండ	15.27	15.78	103.33
తనకల్లు	02.08	03.21	154.26
మొత్తం	151.15 కోట్లు	116.68 కోట్లు	77.20 శాతం

గతేడాది కంటే మెరుగు

గతంతో పోలిస్తే ఈసారి ఆదాయం ఆశాజనకంగా ఉంది. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లక్ష్యం మించి ఆదాయం వచ్చింది. ఈ ఏడాది అన్ని కార్యాలయాల్లో వార్షిక లక్ష్యం వంద శాతం మించి వసూలుకు ప్రయత్నిస్తాం. దళారులతో సంబంధం లేకుండా నేరుగా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాం. – కృష్ణకుమారి, జిల్లా రిజిస్ట్రార్

క్లెయిమ్‌లన్నీ పక్కాగా పరిష్కరిస్తున్నాం

అఖిల పక్ష సమావేశంలో డీఆర్‌ఓ కొండయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అందిన ఫిర్యాదులన్నీ విచారించి పారదర్శకంగా పరిష్కరిస్తున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల డీటీ మైనుద్దీన్‌తో కలిసి డీఆర్‌ఓ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు క్లెయిమ్‌లను పక్కాగా పరిష్కరిస్తున్నామన్నారు. 2022 డిసెంబర్ 26 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకూ ఫారం-6కు సంబంధించి 90,081 దరఖాస్తులు అందగా, 920 ఆమోదించి 8,608 తిరస్కరించామన్నారు. ఇంకా 9,930 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే ఫారం-7కు సంబంధించి 60,874 క్లెయింలు రాగా 1,447 ఆమోదించామన్నారు. 11,553 తిరస్కరించామని, 821 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫారం-8కు సంబంధించి 60,450 క్లెయింలు అందగా, 486 ఆమోదించి 2,695 తిరస్కరించామన్నారు. పెండింగ్‌లో ఉన్న 2,581 క్లెయింలను పరిశీలిస్తున్నామన్నారు. డబుల్ ఎంట్రీలు 761 రాగా, 123 పరిష్కరించామన్నారు. డిసెంబర్ 9వ తేదీలోపు వచ్చిన అభ్యంతరాలన్నీ 26వ తేదీలోపు పరిష్కరించి 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురిస్తామన్నారు. ఇంకా ఏవైనా అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తప్పులు లేని ఓటరు జాబితాకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో నాయకులు హరికృష్ణ, సామకోటి ఆదినారాయణ, రఫీ, రాము, గౌస్‌లాజం, గంగాధర్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూ ఫలితాలు విడుదల

సెమిస్టర్లు, కోర్సుల వారీగా ఫలితాలు

కోర్సు	రాసిన వారు	పాసైన వారు	శాతం
నాలుగో సెమిస్టర్			
బీఏ	1084	378	34.87
బీబీఏ	981	379	38.63
బీసీఏ	29	11	37.93
బీకాం	5157	2162	41.92
బీఎస్సీ	4869	2184	44.86
రెండో సెమిస్టర్			
బీఏ	469	137	29.21
బీబీఏ	589	298	50.59
బీసీఏ	60	43	71.67
బీకాం	4272	1835	42.95
బీఎస్సీ	2036	1168	57.37

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ ఏడాది జూలైలో నిర్వహించిన రెగ్యులర్ బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ రెండు, నాల్గో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. నాలుగో సెమిస్టర్‌కు సంబంధించి మొత్తం 12,120 మంది పరీక్షలు రాయగా 5,114 మంది ఉత్తీర్ణులై 42.19 శాతం పురోగతి సాధించారు. రెండో సెమిస్టర్‌లో మొత్తం 7,426 మంది పరీక్షలకు హాజరు కాగా 3,481 మంది పాసయ్యారు. 46.88 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలు ఈ నెల 16 నుంచి జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని పరీక్షల విభాగం అధికారులు ప్రకటించారు. రీవాల్యుయేషన్/ పర్సనల్ వెరిఫికేషన్ కోసం ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రీవాల్యుయేషన్/ వ్యక్తిగత వెరిఫికేషన్ కోసం పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని డీఆర్‌ఓ కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల నుంచి అర్జీలను స్వీకరించారు. డీఆర్‌ఓ కొండయ్య మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని ఇలా....

- ఫారిన్ సర్వీస్ కింద ఫౌరసరఫరాలశాఖ ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఐదేళ్ల నుంచి పని చేస్తున్నానని, ప్రస్తుతం ప్రభుత్వ సర్వీస్ నిబంధనల మేరకు గడువు దాటింది. తిరిగి మాతృశాఖకు బదిలీ చేయాలని ధర్మవరంకు చెందిన డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి అర్జీ సమర్పించారు.
- వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం కింద 2021 ఏప్రిల్ నుంచి సుమారు రూ.2,55,000 మెడికల్ రీఎంబర్స్ బిల్లులు మంజూరు కావాల్సి ఉందని ఇప్పటికే విద్యాశాఖ కమిషనర్‌కు విన్నవించినా న్యాయం జరగలేదని కొత్తచెరువు బాలుర పాఠశాలలో విశ్రాంత హెచ్‌ఎం రామక్రిష్ణ తెలిపారు. వెంటనే తనకు న్యాయం చేయాలని డీఆర్‌ఓకు విన్నవించారు.

కార్మికుడి మృతి

హిందూపురం అర్బన్: గోళ్లాపురం పారిశ్రామిక వాడలోని (ఏవన్ ఇష్పాట్) ప్రైవేట్ కర్మాగారంలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో 9 మంది కార్మికులు గాయపడినట్లు ఆలస్యంగా తెలిసింది. అందులో నలుగురిని సమీపంలోని కర్ణాటక రాష్ట్రం గౌరిబిదనూరులో చికిత్స పొందుతుండగా మరో ఐదు మంది బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో బీహార్‌కు చెందిన శివనాథ్ (40) అనే కార్మికుడు శుక్రవారం మృతి చెందాడు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తోటి కార్మికులు తెలిపారు. దీంతో శుక్రవారం పరిశ్రమను బంద్ చేయాల్సి వచ్చింది. అయితే తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

తమ్ముళ్ల మట్టి దందా

- రోజుకు 200 లోడ్ల మట్టిని తరలిస్తూ జేబులు నింపుకుంటున్న వైనం
- కళ్ల ముందే మట్టి తరలిపోతున్నా పట్టించుకోని అధికారులు



టీడీపీకి చెందిన వ్యక్తి జేసీబీతో బైరేకుంట చెరువులో మట్టి తవ్వుతున్న దృశ్యం

చిలమత్తూరు: అడ్డదారుల్లో డబ్బు సంపాదించడంలో కొందరు తమ్ముళ్లు ఆరితేరారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో అక్రమాలకు తెరలేపిన కొందరు తెలుగుదేశం పార్టీ నాయకులు నేటికీ ఆ దందాలను కొనసాగిస్తున్నారు. అడ్డు చెప్పేవారిని బెదిరింపులకు గురిచేస్తూ జేబులు నింపుకుంటున్నారు.

చెరువుల్లో మట్టి తవ్వకం

చిలమత్తూరు మండలంలో ఐ టీడీపీకి చెందిన నరేంద్ర సోదరుడు ప్రసన్న జేసీబీల ద్వారా ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నాడు. మట్టిని మండల కేంద్రం గుండా తీసుకెళ్తున్నా ఇరిగేషన్ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. జోరుగా మట్టి తవ్వకాలు చేపట్టడంతో చిలమత్తూరు సమీపంలోని బైరేకుంట చెరువు, చిలమత్తూరు చెరువులో ఇప్పటికే పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఇరిగేషన్ అధికారులు టీడీపీ నేతలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరైతే అరకొర అనుమతులు పొంది ఇటుక బట్టీలకు మట్టిని తోలుతూ జేబులు నింపుకుంటున్నారు.

రోజుకు 200 లోడ్లు..

ఒక్కో ట్రాక్టర్ మట్టికి సుమారు రూ.600 వసూలు చేస్తున్నారు. రోజులో కనీసం 200 లోడ్ల మట్టిని తరలిస్తున్నారు. ఇటుక బట్టీలకు, రియల్టర్లకు చెరువు మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులకు ఎవరైనా సమాచారం అందించినా ప్రయోజనం లేకపోగా కేసు నమోదుకు కూడా వెనకడుగు వేస్తున్నారు. ఇది నిర్లక్ష్యమా.. లేక మామూళ్ల మత్తులో మునిగితేలుతున్నారా.. అన్న చర్చ సాగుతోంది.

చాలా భయంగా ఉంది

మట్టి తవ్వకాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. ఒంటరిగా వెళ్లేందుకు వెనకడుగు వేయాల్సి వస్తోంది. ఒక్కడినే వెళ్లి అడిగినా వాళ్లు ఎవరూ భయపడటం లేదు. ఫోన్ లాక్కొని చంపేస్తారేమో అని భయపడి వెళ్లడం లేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

– గౌతమ్ నారాయణ, ఇరిగేషన్ ఏఈ

పరికరాల నాణ్యతలో రాజీ పడేదిలేదు




డ్రిప్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్ పరికరాల నాణ్యతలో రాజీపడేది లేదని ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో డ్రిప్ కంపెనీల ప్రతినిధులు, ఎంఐ ఇంజనీర్లతో పీడీ సమావేశం నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా పరికరాలు మంజూరు చేసినా, రైతుల నుంచి నగదు రూపంలో తీసుకున్నా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ యేడాది 12,500 హెక్టార్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకూ 8,072 మంది రైతులకు 9,885 హెక్టార్లకు మంజూరు చేశామన్నారు. ఇందులో 90 శాతం మందికి మెటీరియల్ సరఫరా చేశామని తెలిపారు. ఓ వైపు మంజూరు, సరఫరా, మరోవైపు పొలాల్లో బిగించే కార్యక్రమం వేగవంతం చేశామని తెలిపారు. జనవరి నెలాఖరుకే వందశాతం డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

జనవాక్కు

దరఖాస్తు చేసిన వెంటనే బోరు



నేను దళిత కుటుంబానికి చెందిన వ్యక్తిని. నాకు 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే అందులో బోరు లేకపోవడంతో పంటలు పెట్టేందుకు ఇబ్బందులు పడేవాడిని. గతంలో ఏ ప్రభుత్వం నాకు బోరు బావి తవ్వకం చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆన్‌లైన్‌లో బోరుబావి తవ్వకానికి దరఖాస్తు చేసుకున్నాను. ఎవరి ప్రమేయం లేకుండా నా పొలంలో బోరు బావిని ప్రభుత్వం తవ్వించింది. నీరు పుష్కలంగా పడ్డాయి. నిజంగా జగన్‌బాబు మేలును మరువలేను.

– హనుమంతప్ప, అమరాపురం

రెండు రోజుల్లోనే ఇంటి పట్టా



మాది మధ్య తరగతి కుటుంబం. మా నాన్న ఇచ్చిన స్థలంలో 30 ఏళ్ల క్రితం ఇంటిని కట్టుకొన్నాం. అయితే అది గ్రామకంఠంలో మా అనుభవంలో ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎవరి హక్కులో ఉన్న స్థలాలు, ఇళ్లను వారికే హక్కులు కల్పించేందుకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ తీసుకొచ్చారు. దీంతో గ్రామంలోని వలెంటీర్ ద్వారా సచివాలయ సిబ్బందికి దరఖాస్తు చేసుకోగా రెండు రోజుల్లోనే నా పేరు మీద పట్టా ఇంటికి తెచ్చి ఇచ్చారు. గతంలో పలుమార్లు కార్యాలయాల చుట్టూ ఉపయోగం లేకుండా పోయింది. గ్రామ సచివాలయం ఏర్పడ్డాక ఇంటికే పత్రాలు తెచ్చిస్తుండటం హర్షణీయం.

– సరస్వతి, మరువకొత్తపల్లి, చిలమత్తూరు

పాఠశాల చూడచక్కగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు ఆధునిక వసతులు సమకూరాయి. నేను పని చేస్తున్న కంబదూరు ఎస్‌డబ్ల్యూఎస్ ప్రాథమిక పాఠశాలకు మొదటి విడత నాడు–నేడు కింద ప్రభుత్వం రూ.16 లక్షలు మంజూరు చేసింది. దీంతో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల ఇప్పుడు సరికొత్తగా మారింది. నూతన గదులు, మరుగుదొడ్లు, ప్రహరీ , నాణ్యమైన డెస్కులు, తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్, తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండటంతో అడ్మిషన్ల సంఖ్య గతంలో కన్నా పెరిగింది.

– లాలెప్ప, ఉపాధ్యాయుడు, కంబదూరు

మా జీవితాల్లో వెలుగు నింపారు



మేము వ్యవసాయ కూలీలం. నాకు భర్త రంగనాయకులు, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం మాది. అలాంటి మా జీవితాల్లో అమ్మఒడి, రైతు భరోసా పథకాలు వెలుగులు నింపాయి. కుమార్తె మహిమ స్థానిక మోడల్‌స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. కుమారుడు రాజు సైతం అదే స్కూల్‌లో 8వ తరగతి చదవుతున్నారు. నాలుగేళ్లుగా కూతురుకు రూ.15 వేల చొప్పున అమ్మఒడి పథకం డబ్బులు వచ్చాయి. అలాగే జగనన్న గోరుముద్ద, విద్యాకానుక లాంటివి బిడ్డలిద్దరికీ వరమయ్యాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడిలో చదువు చెబుతున్నారు.అంతే కాదు మాకు 1.65 ఎకరాల భూమి ఉండగా రైతు భరోసా పథకం కింద రూ.13,500 చొప్పున వ్యవసాయ పెట్టుబడిగా ఇస్తూ సీఎం జగనన్న అండగా ఉంటున్నారు.

– ఎం ధనలక్ష్మి, పీ కొండాపురం, పామిడి

గొల్లపల్లిలో ఘోరం



చికిత్స పొందుతున్న గంగాధర, కుమార్తెలు గంగోత్రి, కావేరి, కీర్తి

- ముగ్గురు పిల్లలు సహా తండ్రి ఆత్మహత్యాయత్నం

రాయదుర్గం: బంధువుల్లో ఒకరి వివాహేతర సంబంధానికి తమను బాధ్యులను చేస్తూ దెప్పిపొడుస్తుండటాన్ని భరించలేకపోయిన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెందాడు. చావే శరణ్యమనుకున్నాడు. తను పోయాక పిల్లలు అనాథలవుతారని భావించాడు. చివరకు ముగ్గురు కూతుళ్లకు విషం తాపి.. ఆపై తానూ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. రాయదుర్గం పట్టణ శివారులో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండం గొల్లపల్లికి చెందిన వడ్డే గంగాధరకు గుమ్మఘట్ట మండలం పూలకుంటకు చెందిన వడ్డే గీతతో వివాహమైంది. వీరికి ఎనిమిదేళ్ల వయసున్న గంగోత్రి, ఆరేళ్ల వయసున్న కావేరి, రెండేళ్ల వయసున్న కీర్తి సంతానం. గొల్లపల్లిలోనే భార్యతో కలిసి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్దకుమార్తె గంగోత్రిని చదువుకునేందుకు పూలకుంటలో అమ్మమ్మ, తాతయ్యల వద్దకు పంపించాడు. ఇదిలా ఉండగా.. భార్య తరపు బంధువుల్లోని ఒక వివాహితకు గొల్లపల్లిలోని వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. విషయం బయటపడిన తర్వాత వివాహిత కుటుంబంలో చిచ్చు రేగి కాపురం కూలింది. ఇందుకు గంగాధర్‌ను బాధ్యుడిని చేస్తూ భార్య తరపు బంధువుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. దెప్పిపొడుపు మాటలు భరించలేకపోయిన గంగాధర ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. కూతుళ్లు అనాథలు కాకూడదని భావించి వారిని చంపి.. తర్వాత తానూ చావాలనుకున్నాడు. శుక్రవారం భార్య కూలి పనికి వెళ్లగానే.. తన వద్ద ఉంటున్న ఇద్దరు కూతుళ్లను 'అమ్మమ్మ ఊరికెళ్దాం' అని చెప్పి ద్విచక్ర వాహనంపై బయల్దేరి పూలకుంట ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న పెద్ద కుమార్తె వద్దకు వెళ్లాడు. అటు నుంచి ముగ్గురు కుమార్తెలతో కలిసి రాయదుర్గం పట్టణ శివారులోని రస సిద్దుల కొండ వద్దకు చేరుకున్నాడు. అప్పటికే పురుగుమందు కలిపిన కూల్ డ్రింక్‌ను కూతుళ్లకు తాపించి, తనూ తాగాడు. చిన్నమ్మాయి కీర్తి కడుపులో మంట అంటూ విలవిల లాడుతుండటంతో చూడలేక అందరినీ తీసుకుని బైక్‌పై రాయదుర్గం ఆస్పత్రికి తీసుకొచ్చి చేర్చాడు. వైద్యులకు విషయం తెలియజేశాడు. వెంటనే వైద్యులు చికిత్స ప్రారంభించారు. అయితే చిన్నారి కీర్తి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తేల్చారు. మిగిలిన వారిలోనూ మోతాదుకంటే ఎక్కువగా పురుగుమందు ఉన్నట్టు నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం నలుగురినీ అనంతపురం సర్వజన ఆస్పత్రికి పంపించారు. ఆస్పత్రి వద్దకు చేరుకున్న గీతా పిల్లలను చూసి బోరున విలపించింది. ఎంతపనిచేశావయ్యా అంటూరోదించింది. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రమణ తెలిపారు.

రామోజీవి బుద్ధిలేని రాతలు

- విద్యార్థుల మనోభావాలు దెబ్బతినేలా కథనాలా?
- నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఎక్కడా లేని విధంగా నాడు–నేడు ద్వారా విద్యా రంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే విధంగా ప్రభుత్వ బడులను తయారు చేశారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్స్ అందించారు. ఇలాంటి వాటిపై ఈనాడు అధినేత రామోజీరావు రోత రాతలు రాయించడం పత్రికా రంగానికే సిగ్గుచేటు' అని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన బుక్కపట్నం మండలం సిద్దరాంపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్స్ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ట్యాబ్స్ తమకెంతో ఉపయోగకరంగా ఉన్నాయని విద్యార్థులు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి తమలాంటి ఎంతో మంది పేద విద్యార్థులకు ఉత్తమ బోధన లందిస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రామోజీరావు కుల దురహంకారంతో రగిలిపోతున్నాడని విమర్శించారు. సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ట్యాబ్స్ పంపిణీపై బుద్ధిలేని రాతలు రాస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెత్తందారుల కోసమే రోత రాతలు..

సీఎం జగన్ పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని వారిలో విజ్ఞానం పెంపొందించాలనే ప్రభుత్వ పాఠశాల్లో 8వ తరగతి చదివే విద్యార్థులకు ట్యాబ్స్ అందిస్తున్నారని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. దీన్ని ఓర్వలేని రామోజీ కుల పిచ్చితో పెత్తందారుల కోసం ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా విషపు రాతలు రాయిస్తున్నాడని మండిపడ్డారు.

అవినీతిని వెలికి తీసినందుకే ..

రామోజీరావు అవినీతి అక్రమాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బయటకు తీసినందుకే రాష్ట్ర ప్రభుత్వం పైనా, సీఎం జగన్‌పైనా పనికిమాలిన రాతలు రాయిస్తున్నాడని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని సీఎం జగన్‌కు క్షమాపణలు చెప్పాలని రామోజీరావుకు హితవు పలికారు.

నీటి డ్రమ్ములో మహిళ మృతదేహం

గంగవరం: స్థానిక సాయినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఇంటి వద్ద నీటి డ్రమ్ములో మహిళ మృతదేహం శుక్రవారం వెలుగు చూసింది. కూలీలు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె శరీరంపై దుస్తులు లేకపోవడం, గాయాలు ఉండటంతో ఎవరో హత్య చేసి పడేసినట్లు అనుమానిస్తున్నారు. ఆధార్ కార్డు వివరాల మేరకు మృతురాలు అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన లక్ష్మి (57)గా గుర్తించారు. ఆమె 13 ఏళ్లగా పలమనేరు పరిసరాల్లో చెత్త బాటిళ్లు ఏరుకుంటూ గుండుబావి వద్ద గుజిరీ అంగడిలో విక్రయించుకుని జీవనం సాగించేది. గురువారం సాయంత్రం బాటిళ్లను విక్రయించి మొబైల్‌కు చార్జింగ్ పెట్టుకుని వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఎవరో ఆమెను హత్య చేసి డ్రమ్ములో పడేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో కార్పెంటర్ మృతి



మృతుడు షాషావలి

గుంతకల్లు రూరల్: విద్యుదాఘాతానికి గురై షేక్ షాషావలి (48) అనే కార్పెంటర్ మృతి చెందిన సంఘటన గుంతకల్లు పట్టణంలో చోటు చేసుకుంది. హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన షాషావలికి భార్య గోరీమా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం గుంతకల్లు పట్టణంలోని ప్రతిభా వికాస్ స్కూల్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్యాంసుందర్ అనే వ్యక్తి ఇంట్లో కార్పెంటర్ పనికి వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురికావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. కసాపురం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి అదృశ్యం



పవన్ (ఫైల్)

తాడిపత్రి అర్బన్: పట్టణానికి చెందిన ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు... పట్టణంలోని సంజీవనగర్ జీరో రోడ్డులో నివాసముంటున్న అరుణ ,మురళీ దంపతులకు కుమారుడు పవన్ ఉన్నాడు. స్థానిక మోడల్ పాఠశాలలో పవన్ 9వ తరగతి చదువుతున్నాడు. గురువారం పవన్‌ను తల్లి అరుణ స్కూలుకు వెళ్లి చదువుకోమని చెప్పింది. అయితే రాత్రి 8 గంటల సమయంలో పవన్ ఇంటి నుంచి తిరిగి రాలేదు. తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

తోపుదుర్తి కుటుంబానికి ప్రజలే బలం

- మా ప్రయాణమంతా రాప్తాడు ప్రజలతోనే..
- కమీషన్లు నొక్కిన చరిత్ర పరిటాల కుటుంబానిదే..
- తప్పులు మీరు చేసి నిందలు మాపైన వేస్తారా?
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: తోపుదుర్తి కుటుంబానికి ప్రజలే బలమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను మరోసారి రాప్తాడు నుంచే పోటీ చేసి 2024లో మళ్లీ అసెంబ్లీలోకి అడుగుపెడతానని అన్నారు. తాను పుట్టి పెరిగిన నియోజకవర్గం రాప్తాడు అని, చివరి క్షణం వరకూ ఇక్కడే ఉంటానని స్పష్టం చేశారు. తాతల నాటి కాలం నుంచి తమ ప్రయాణమంతా రాప్తాడు నియోజకవర్గ ప్రజలతోనేనన్నారు.

రూ.2,500 కోట్ల లబ్ధి

రాప్తాడు నియోజకవర్గానికి పరిటాల కుటుంబం మేఘం లాంటిదని, అలా వచ్చి ఇలా వెళ్లిపోతుందన్నారు. తాను ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురాలేకపోయానంటూ పరిటాల సునీత మాట్లాడుతున్నారని, డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రాప్తాడు నియోజకవర్గంలో దాదాపు రూ. 2,500 కోట్లు పేదల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తమదన్నారు. 2008లో ఉచిత బోర్లు మొదలు పెట్టి దాదాపు 2 వేలు బోర్లు వేయించామని, ఎమ్మెల్యే అయిన తర్వాత కూడా దాదాపు 2 వేల ఉచిత బోర్లు వేయించామన్నారు.


ఎన్నికల్లోపు రిజర్వాయర్ పనులు

ఎన్నికల్లోపు తోపుదుర్తి రిజర్వాయర్ పనులు మొదలు పెడతామని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకురావాలనే ఆలోచన వచ్చిన వెంటనే సీఎం జగన్ ఆశీస్సులతో ఆచరణలోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకురావచ్చని తాను ఎన్నోమార్లు చెప్పినా పట్టించుకోకుండా పరిటాల సునీత మంత్రిగా ఉన్న సమయంలో ఏకంగా రూ. 800 కోట్లతో టెండర్లు పిలిచి రూ. 20 కోట్లు పనులు చేసి రూ. 40 కోట్లు బిల్లులు చేసుకున్నారని విమర్శించారు. తోపుదుర్తి రిజర్వాయర్ భూసేకరణకు డబ్బులు తీసుకురాలేదని ఆరోపణలు చేస్తున్నారని, రిజర్వాయర్‌కు సంబంధించి బాధిత రైతులకు న్యాయం చేసి పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు.

కమీషన్లు నొక్కిన చరిత్ర పరిటాల కుటుంబానిదే..

రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు తెప్పిస్తామన్నారు. మీలాగా రైతులను మోసం చేసే ఆలోచనలు తమ చరిత్రలోనే లేవన్నారు. పరిహారం ఇవ్వకుండా రైతులను మధ్యపెట్టి కాంట్రాక్టర్లతో పనులు చేయించి వారితో కమీషన్లు నొక్కిన చరిత్ర పరిటాల కుటుంబానిదేనన్నారు. ఎస్‌కేసీ కంపెనీ 2018లో రాప్తాడు నియోజకవర్గంలో 33 రోడ్లు కాంట్రాక్టులు తెచ్చుకుందని, ఎన్నికల ముందు పనులు చేస్తున్నట్లు హడావుడి చేశారే తప్ప తర్వాత పనులను నిలిపివేశారన్నారు. నేటికీ ఆ పనులు వాళ్లే చేపడుతున్నారని గుర్తు చేశారు. పనులు నిలుపుదల చేస్తే గ్రాంటు వెనక్కు పోతుందనే కారణంతో ఆ కంపెనీతోనే పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. అలాంటి మీ కంపెనీ రోడ్లు వేయకుండా తమపై బురద జల్లడం దారుణమన్నారు. తాను సబ్ కాంట్రాక్ట్‌గా చేసిన పనులకు బిల్లులు చేసుకున్న సంస్కృతి వాళ్లదేనన్నారు. రోడ్ల నిర్మాణాల్లో తప్పులు వాళ్లు చేసి నిందలు తమపై వేస్తున్నారన్నారు. పనులు పూర్తి చేసేందుకు కొంత గడువు ఇచ్చి గడువులోపు పనులు చేయకపోతే పరిటాల సునీత ఇంటి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. రుద్రంపేట నుంచి కట్టకిందపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్ట్ తీసుకున్న సంస్థ సోమ వారంలోగా పనులు మొదలు పెట్టకపోతే కాంట్రాక్టర్ ఇంటిముందు కూడా ధర్నా చేస్తామన్నారు. గ్రామాల్లో వంద రోజుల్లో వంద కిలోమీటర్ల ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. ప్రసన్నాయపల్లి పంచాయతీలో ఆరు కిలోమీటర్లు, కక్కలపల్లికాలనీ, పాపంపేట పంచాయతీల్లో దాదాపు 30 కిలోమీటర్ల సీసీ రోడ్లు, మట్టిరోడ్లు, డ్రైనేజీలు వేస్తున్నామన్నారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి



మృతుడు ఆలంగిర్‌షేక్

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలోని నాసిన్ సంస్థలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా ఓ కార్మికుడు భవనంపై నుంచి కాలుజారి పడి మృతి చెందాడు. సీఐ సుబ్బరాయుడు వివరాలమేరకు... వెస్ట్ బెంగల్ రాష్ట్రానికి చెందిన ఆలంగిర్‌షేక్ (26) అనే కూలీ భవన నిర్మాణ పనుల్లో భాగంగా ఐదేళ్లుగా నాసిన్‌లో పనులు చేస్తున్నాడని చెప్పారు. రోజులాగానే శుక్రవారం కూడా ఆలంగిర్‌షేక్ భవన నిర్మాణ పనులకు వెళ్లాడన్నారు. అయితే పనిచేస్తుండగా భవనంపై నుంచి కాలుజారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు వివరించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గోరంట్ల: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి గ్రామానికి చెందిన కురబ రాజకుమార్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఆయన వివరాలమేరకు... కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో శుక్రవారం గుమ్మయ్యగారిపల్లి సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టమన్నారు. ఈ క్రమంలో గుమ్మయ్యగారిపల్లికి రాజకుమార్ తన ద్విచక్ర వాహనంపై కర్ణాటక మద్యం తరలిస్తుండగా గుర్తించమన్నారు. అతని వద్ద నుంచి 240 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని తెలిపారు. అక్రమ మద్యం తరలించడానికి వినియోగించిన ద్విచక్ర వాహనం సీజ్ చేశామని వివరించారు. నిందితుడిని పెనుకొండ కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.